స్వచ్ఛమైన ప్రేమకు ప్రళయం కూడా అనుకూలమే అనిపిస్తుంది ఈ సంఘటన చూస్తుంటే...'' అని ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. 'ఎంత విచిత్రం...! ఇంత భయంకరమైన వరద వచ్చినా ఒక్కరుకూడా చనిపోలేదంటే... నమ్మలేకపోతున్నాను...'

# తీపిగుర్తు

భారీ వర్షం...వరద బీభత్సం... అతలాకుతలమైంది నగరం. ఇంతటి ఘోర పరిస్థితి ఎన్నడూ చూడలేదు. తుంగభద్ర ఉగ్రరూపం పట్టణాన్ని కుదిపివేస్తుంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైయ్యాయి. రోడ్లు నదుల్ని తలపిస్తున్నాయ్! పోలీసులు, జిల్లా అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసే పనుల్లో తలమునకలై ఉన్నారు.

సాయంత్రమైంది. వర్షపు జోరు తగ్గనేలేదు. క్షణక్షణానికి వరద ఉధృతి పెరుగుతూ ఉంది. చీకటి కమ్ముకుటోంది. దాదాపుగా మా చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సముద్రాన్ని తలపించేటట్లుందా ప్రాంతమంతా. ఆ ప్రాంతంలో ఎత్తైన మిద్దె మాదే. చుట్టు ప్రక్కవారంతా మా మిద్దెపైకి చేరారు. జోరు వాన... అటూ ఇటూ కదలడానికి కూడా వీలులేనంతగా కిక్కిరిసిపోయింది ఆ ప్రాంతం. ఎవరి పిల్లల్ని వారు కాపాడుకొనే ప్రయత్నంలో ఉన్నారంతా. సెల్ ఫోన్లతో టి.వి. ఛానల్స్ వారిని, ఎమర్జన్సీ నెంబర్స్ 100, 108 లను ఫోన్ చేసి సహాయాన్ని అర్థిస్తున్నారు. ఏ ఆఫీసుకు ఫోన్ చేసినా నో రెస్పాన్స్.

పట్టణమంతా ఘాడాంధకారంలో ఉంది. ఒకరి ముఖాలొకరికి కనిపించే పరిస్థితి లేదక్కడ.

ఆర్తనాదాలు... ఆకలి కేకలు తప్ప మరే శబ్దం వినిపించే అవకాశం లేదు. అంతకం తకు పెరుగుతుందే కాని, తగ్గే సూచనలేవి కనిపించడం లేదు వాన జోరు చూస్తే. ఓ మెరుపు మెరిసింది ఆకాశాన్ని చీలుస్తున్నట్లు... ఆ కాంతి దూరంగా సొమ్మసిల్లి పడివున్న కీర్తనపై పడింది.

జనప్రవాహాన్ని చీల్చుకొంటూ కీర్తనవైపు దూసుకెళ్ళాను. తడిసి ముద్దైవున్న శరీరాన్ని అమాంతంగా ఒడిసి పట్టుకొన్నాను. చలికి గడగడ వణుకుతుంది. నా రైన్‌కోట్ తీసి ఆమెకు తొడిగాను. ఆమె అరచేతిని నా చేతుల్తో రుద్ది వేడి పుట్టించినా, చలనం లేదు. ఆమెను రక్షించు కోవడమే నా తక్షణ కర్తవ్యం.

''కీర్తనా... కీర్తన...'' అంటూ ఆమె శరీరాన్ని అటూ ఇటూ కుదిపేశాను. ఏమాత్రం స్పృహలో లేదు. ఈ రాత్రికి ఆమెను రక్షించుకోగలిగితే చాలు అనుకొన్నాను. నా ఇష్టదైవాన్ని మనస్సులో తలచుకొని... ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను.

❖ ❖ ❖

కీర్తన మా ఎదురింటి అమ్మాయి. డిగ్రీ చదువుతోంది. అందానికి నిర్వచనం ఆమే! అందమైన కళ్ళు, చూడ ముచ్చటైన ముక్కు, దొండ పండులాంటి పెదవులు. నాజూకైన నడుం. విశ్వసుందరి ఐశ్వర్యకు సరితూగే ఎత్తు వెరసి ఓ అందాలరాశి. కట్టుబొట్టులో అచ్చం ఆరణాల ఆంధ్రా ఆడపడుచు అనిపిస్తుందామె.

వాళ్ళ నాన్న చనిపోయి ఐదేళ్ళైంది. అంతా తానై కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. ఓ కంపెనీలో కంప్యూటర్ సెక్షన్‌లో పనిచేస్తుంది. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ చదువుకొంటుంది. అమ్మ, ఇద్దరు తమ్ముళ్ళు అది క్లుప్తంగా వారి కుటుంబం.

మా నాన్న సర్పంచ్‌గా కొంతకాలం ఆత్మకూరు

సూర్యషంషుద్దీన్

## ఆకారం

**హో**దా వుంటే
మన్మధాకారం;
సాదాసీదాగా వుంటే
మహావికారం

## అధికారం

**కా**ళ్ళను
కుర్చీ కెక్కిస్తుంది
కళ్ళను
నెత్తికెక్కిస్తుంది
చివరకు ప్రాణాన్నే
పోయేటట్టు కక్కిస్తుంది

## 'అగ్ర'గణ్యుడు

గెలిచేదాక
'ఓటు' మాటలు
గెలిచాక
ఓటి 'మాటలు'
అయినా నిలిచేదాక
కడతాడు మూటలు

**వెలివల సాంబశివరావు**

మండలంలో పనిచేశారు. ఇప్పుడు వ్యవసాయం చూసుకొంటూ ఇంటిపట్టునే ఉంటున్నారు. ఆ రోజుల్లోనే అగ్రికల్చర్ బియస్సీ చేశారాయన. కాస్త ఉన్న కుటుంబమే మాది. పిల్లలంటే ప్రాణం మా నాన్నకు; ముఖ్యంగా నేనంటే చాలా ప్రేమ. నేను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు రోజుకి ఐదారుసార్లు ఫోన్‌చేసి బాగోగులు విచారిస్తుంటారాయన. ఆయన మాటే వేదం మాకు. ఎదురు చెప్పే ప్రయత్నం ఎవ్వరం చెయ్యం. చివరికి మా బంధువర్గంలో కూడా ఆయనదే పై చేయి.

నామీద చాలా ఆశలున్నాయి ఆయనకు. మంచి ఉన్నత కుటుంబంలోంచి కోడల్ని తెచ్చుకోవాలని అమ్మతో చెబుతుంటే చాలాసార్లు విన్నాను. "మా వాడు సాఫ్ట్‌వేర్,ఎక్కడ సిటీ అమ్మాయిని తీసుకొస్తాడో..." అని మామయ్యతో అంటుంటే విన్నాను.

కీర్తన అంటే నాకు ప్రాణం. ఏనాడు ఆమెకు నా ప్రేమను తెలపలేదు. చూపులకే పరిమితమయ్యాం. అయితే మా మనస్సులకు తెలుసు ఒకరంటే ఒకరికి ఇష్టమని. వీకెండ్ అయితే ఇంట్లో వాలిపోతాను.

నా ఫ్రెండ్స్ అంటుంటారు "వీకెండ్‌కి సిటీలో ఎంజాయ్ చెయ్యక కర్నూల్ వెళ్తావేమిట్రా?" అని. నాకు ఇక్కడ ఆనందం దొరుకుతుందని వారికేం తెలుసు.

నాకోసమే అన్నట్లు వీకెండ్‌లో ఎంత అందంగా ముస్తాబవుతుందో కీర్తన. ఎన్నిసార్లు పెరటులో తారాడుతుందో... ఎన్ని చూపుల బాణాలు వదులుతుందో... ఎన్ని నవ్వుల ముత్యాలు రాలుస్తుందో... ఆ అనుభూతి ఎంతో మధురం. అందుకే మిస్ అవ్వడం నాకసలు ఇష్టముండదు. ఆ ఎదురింటి కుటుంబం అంటే మా నాన్నకు సానుభూతే కాని కోడల్ని చేసుకొనేంత విశాల హృదయం లేదు. వాళ్ళ అవసరాలకు అమ్మానాన్న సహాయపడుతుంటారు. మంచి కుటుంబం అన్న అభిప్రాయం. మగదిక్కులేని కుటుంబమన్న సానుభూతి. ఇంతకంటే ఒక్క అక్షరం కూడా ఎక్కువ ఆలోచించరు మా నాన్నగారు ఆ కుటుంబం గురించి.

❖ ❖ ❖

అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని, సహాయం కోసం ఎదురుచూసి చూసి... నీరసించిపోయారందరూ. కొంతమంది స్పృహతప్పి పడిపోయారు. శక్తిని కూడగట్టుకొని తమ పిల్లల్ని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు కొందరు. ఎవ్వరూ ఎవ్వర్ని పట్టించుకొనే స్థితిలో లేరు.

అచేతనంగా నా ఒడిలో వాలిపోయింది కీర్తన. దగ్గరకు తీసుకొని హృదయానికి హత్తుకొన్నాను. గట్టిగా ఊపిరి పీల్చి ఆమె నోట్లోకి ఊదేసరికి... ఆమెలో చలనం కలిగింది. భారంగా కళ్ళు తెరుచుకొన్నాయి. చెప్పలేనంత సంతోషం నాలో.

చుట్టూ పరికించి చూసింది. గాఢమైన చీకటి. తళుక్కున ఓ మెరుపు ఆకాశం బద్దలైనట్టు శబ్దం చేస్తూ... ఒకరిని ఒకరు చూసుకొన్నాం. ఇలాంటి పరిస్థితిలో... దగ్గరవ్వడం బాధను కలిగించినా... ఆ స్పర్శ ఆమెకు ఆనందాన్ని కలిగించినట్లుంది. నా హృదయంపై వాలిపోయింది. కళ్ళెంబడి ధారాపాతంగా కన్నీళ్ళు... వర్షపు

నీరు మిళితమై నన్ను ఉక్కిరిబిక్కిరిచేశాయి. గాలికి కూడా చోటివ్వనంతగా దగ్గరయ్యాం.

ఎన్ని వీకెండ్స్ ఎదురుచూశానో ఈ స్పర్శకోసం... ఆనంద గడియకోసం. ''ఐ లవ్ యూ...'' అన్నాను ఆమె చెవి దగ్గర గుసగుసగా. ''ఐ...టూ'' అంటూ నా వీపుని రెండు చేతులు గట్టిగా పెనవేసుకొన్నాయి. రైన్ కోట్ ఇద్దరిని ఒకటి చేసింది. హృదయాలు రెండూ ఏకమయ్యాయి.

❖ ❖ ❖

హెలికాప్టర్ మా మిద్దెపైన ఆగిన శబ్దం... ఉలిక్కి పాటుగా కళ్ళు తెరిచాను. తెల్లారింది. వర్షం ఆగింది. ఎదురుగా ఆహార పొట్లాలతో మా నాన్న నిలబడి ఉన్నారు.ఉన్న ఫలాన లేచినిలబడ్డాం ఇద్దరం. నవ్వుతూ... ఇద్దరిని దగ్గరకు తీసుకొన్నారు. కీర్తన తల నిమురుతూ... ''మీ ఇల్లు వరదలో కొట్టుకు పోయింది. ఇక మా ఇల్లే నీ ఇల్లు'' అన్నారు. సాక్షాత్తు దేవుడు ప్రత్యక్షమై వరమిస్తున్నట్లు అనిపించింది నాకు మా నాన్నను చూస్తుంటే. దూరంగా కీర్తన వాళ్ళమ్మ, తమ్ముళ్ళు కూర్చొని అంతా గమనిస్తున్నారు. వాళ్ళవైపు పరుగుతీసింది కీర్తన.

అక్కడే కూర్చుండిపోయాను. ఆకాశంలో వేగంగా కదులుతున్న మబ్బును చూస్తూ.... ఇంత బీభత్సాన్ని సృష్టించిన వరద, ఓ తీపిగుర్తును మిగిల్చిందనట్లు.

''స్వచ్ఛమైన ప్రేమకు ప్రళయం కూడా అనుకూలమే అనిపిస్తుంది ఈ సంఘటన చూస్తుంటే...'' అని ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. 'ఎంత విచిత్రం...! ఇంత భయంకరమైన వరద వచ్చినా ఒక్కరుకూడా చనిపోలేదంటే... నమ్మలేకపోతున్నాను...' అంటూ నాపక్క నుంచి ఇద్దరు కదిలారు. ఆనందమేసింది. అద్భుతం అనిపించింది. ''రెండు మనస్సులను ఏకం చెయ్యడానికీ వచ్చిందా... ఈ వరద'' అని అనుకొంటుంటేనే నా ఒళ్ళు పులకరించింది. దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాను కళ్ళు మూసుకొని. ■

## బుడతలు

బియ్యం
నెయ్యం చేసింది
నూనె
పప్పు
అప్పు మిగిల్చింది.
టమాట
ధరల ఆటలో
భూమి
ఆకాశం
రాతలు
పత్రికను బట్టి మారుతాయి
గోతులు
తవ్వకుండానె ఏర్పడతాయి
అసెంబ్లీ
కోవెలలో
నాయకుల కీచులాట
సమస్య పడవలు
డ్రైనేజి బాట
పార్టీకొక పత్రిక
గారడి మాటల చిత్రిక
ప్రజాగోడు పట్టదిక

**జె.కొండన్న**

## ఒక అనంతం

శ్రీశ్రీ అంటే ఒక అనంతం
ఒక గారడీ
ఒక అక్షర విన్యాసం
ఒక శబ్ద పరిమళం
ఒక మెరుపు దాడి
ఒక తిరుగుబాటు
శ్రీశ్రీ అంటే ఒక జనవాక్యం
ఒక జలదరింపు
ఒక వడగాడ్పు
ఒక చైతన్య శిఖరం
ఒక సరళీకృతం
ఒక ఓదార్పు హస్తం
శ్రీశ్రీ అంటే ఒక మహాప్రస్థానం
ఒక తెలుగు వెలుగు
ఒక సాహితీ జిగీష
ఒక సామాజిక స్పృహ
ఓ ఎర్రని బావుటా
ఒక విప్లవ నాదం!!

**జి.శైలూషి**